సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



గంజాయి ముఠాపై పోలీసుల ఉక్కుపాదం

మదనపల్లెలో గంజాయి ముఠాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. 18 మంది విక్రేతలను అరెస్ట్ చేశారు. - 10లో



చిరుద్యోగుల ఆకలి కేకలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధానంగా చిరుద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. - 10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.200
రెండోరకం	రూ.80	రూ.136



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 176 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	406.33
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 48.280 కిలోలు

న్యూస్‌రీల్

ఎంపీ, ఎమ్మెల్యే కృషితో జయంతి రైలుకు హోల్టింగ్

రాజంపేట : ఎంపీ మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కృషితో జయంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హోల్టింగ్ ఉత్తర్వులు వెలువడ్డాయని గుంతకల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్‌రెడ్డి అన్నారు. రాజంపేటలో ఆయన మంగళవారం మాట్లాడుతూ రాజంపేటలో జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేయాలని వినతులు పంపారన్నారు. కరోనా ముందు నుంచి హోల్టింగ్ ఉన్న రైళ్లకు హోల్టింగ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జయంతి ఎక్స్‌ప్రెస్‌కు ముందుగానే రిజర్వేషన్ చేసుకున్న అయ్యప్ప స్వాములకు ఉపయోగకరంగా నిలుపుదల ఉత్తర్వులు దోహదపడతాయన్నారు.

సౌమ్యనాథ స్వామి హుండీ ఆదాయం లెక్కింపు



నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. రూ. 3,31,968 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం డబ్బును ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టీటీడీ విజిలెన్సు అధికారి జానకీ రామ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

రాయచోటి టౌన్ : వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం మన కర్తవ్యం అని రాయచోటి ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ అధికారులకు సూచించారు. మంగళవారం రాయచోటి ఆ శాఖ సర్కిల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ / డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో పాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాయచోటిలో నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని చెప్పారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్) : బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులకు సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు అన్నమయ్య జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఓఎంసీఏపీ, ఏఎల్-వైఓయుఎస్‌యుఎఫ్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ చేసిన నిరుద్యోగులకు సౌదీఅరేబియా దేశంలో ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండి 1-5 సంవత్సరాల అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 99888 53335, 87126 55686 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

సేద్య పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వైవీయూ : జిల్లాలో బిందు, తుంపర సేద్య పరికరాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీ సూక్ష్మనీటి సాగుపథకం (ఏపీఎంఐపీ) ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ కార్యాలయంలో కంపెనీ డీలర్లు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 29,300 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే జిల్లాలో 21,746 మంది రైతులు 27,768 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం చేసేందుకు పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో ఇప్పటికే 4072 మంది రైతులు 4780 హెక్టార్లలో సేద్యం చేసేందుకు పరిపాలనా ఉత్తర్వులు పొందారన్నారు. గ్రామాలలో బిందు/తుంపర సేద్యపరికరాలు అవసరమున్న రైతులను గుర్తించి వీఏఏఎస్/వీహెచ్ఏఎస్/వీఎస్ఏఎస్, ఎంఐఏఓల ద్వారా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేలా డీలర్లు అవగాహన కల్పించాలన్నారు.

హోల్టింగ్స్.. నో రూల్స్

- హోల్టింగ్స్ ఎత్తివేతతో ప్రయాణికులకు తిప్పలు
- రైల్వే ఉన్నతాధికారుల నిర్ణయంపై ఆగ్రహం

రాజంపేట : ఉభయ జిల్లాల రైలు మార్గంలో స్టేషన్లలో పలురైళ్ల హోల్టింగ్స్ ఎత్తివేత రగడ రాజుకుంటోంది. హోల్టింగ్స్ మెయింటెన్స్ వ్యవహారం పట్టాలు తప్పిందన్న ఆరోపణలు దక్షిణ మధ్య రైల్వే చుట్టుముడుతున్నాయి. హోల్టింగ్స్ ఎత్తివేసిన ప్రతి స్టేషన్‌లోనూ స్థానిక సిబ్బందిని ప్రయాణికులు నిలదీస్తున్నారు. సిబ్బందితో వాగ్వివాదాలు, గొడవలు తరుచుగా జరుగుతున్నాయి. ఏమీ చెప్పుకోలేకపోతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయం తమకు శాపంగా మారిందని లోలోపల వారు మదనపడుతున్నారు.

హోల్టింగ్ ఎత్తివేత దుస్థితి ఇలా..

జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వే కేంద్రంలో దాదాపు అప్ 13, డౌన్‌లో 13 రైళ్లు నడుస్తుంటే ఇందులో 3 రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. ఈ రైళ్లే కరోనా ముందు ఒక్క నందలూరే కాకుండా కమలాపురం, కొండాపురం, ముద్దనూరులో ఆగేవి. ఇప్పుడు ఆ పరిస్థితిని పునరుద్ధరించకుండా రైల్వే ఉన్నతాధికారులు కాలయాపన చేస్తున్నారు. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంలో దేశ రాజధానికి వెళ్లే ఏకైక రైలు స్టాపింగ్ లేకపోవడం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. హరిప్రియ హోల్టింగ్ ఎత్తేశారు. ఇలా



నందలూరులో హోల్టింగ్ ఎత్తివేతతో పాస్త్రూగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు

ఏదో ఒకచోట ఏదో ఒకరైలు హోల్టింగ్ లేకుండా చేస్తున్నారు. ఇదంతా బీజేపీ ప్రభుత్వంలోనే జరుగుతోందని జిల్లా ప్రయాణికులు పెదవి విరిస్తున్నారు.

సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులకు ఇబ్బందులు..

హోల్టింగ్ ఎత్తివేత నేపథ్యంలో సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాల కాలం నుంచి హోల్టింగ్స్ కొనసాగుతున్న నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, ముద్దనూరు, కొండాపురం, కమలాపురం, ముద్దనూరులో కొన్ని రైళ్లకు హోల్టింగ్ ఎత్తివేశారు. 1 లేదా 2 నిమిషాలకు ఏదో మునిగిపోయినట్లుగా రైల్వే ఉన్నతాధికారులు తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రయాణికులకు ఇక్కట్లు తెచ్చిపెడుతున్నాయి.

ప్రయోగాత్మక హోల్టింగ్స్‌తో ప్రయాణికులతో ఆటలు..

ఇటీవల రైల్వేశాఖ కొత్త ప్రయోగానికి తెరతీసింది. ప్రయోగాత్మక హోల్టింగ్ అంటూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. ప్రయోగాత్మక హోల్టింగ్స్ పేరుతో ఆరునెలల వరకు హోల్టింగ్ అని కంటి తుడుపుగా ఆర్డర్స్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఆరునెలల తర్వాత ఎర్నింగ్స్ ఉన్నా లేకున్నా అదే సాకుచూపి, హోల్టింగ్ ఎత్తి వేస్తుంటారు. ఉన్నతాధికారులకు నచ్చితే వారికి అవసరమైతే ఆ రైలుకు హోల్టింగ్ ఇచ్చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

➠ రైలు ప్రయాణాలకు దూరంగా సామాన్యులు...

రైల్వే ఉన్నతాధికారులు రైళ్ల హోల్టింగ్ ఎత్తివేత విషయంలో లేనిపోని నిబంధనలు పెట్టడం ఇప్పుడు వివాదాస్పదంగా మారుతోంది. ఫలితంగా ఓ మోస్తారు రైల్వేస్టేషన్లలో రైళ్లు ఆగకపోవడం వల్ల చాలామంది సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులు దూరమయ్యారనే అపవాదును దక్షిణ మధ్య రైల్వే మూట కట్టుకుంది. ఆయా పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో పలు రైళ్ల హోల్టింగ్స్ విషయంలో ప్రజాప్రతినిధులకు తెలియకుండానే హోల్టింగ్స్ ఇవ్వడం, ఎత్తివేయడం లాంటివి నిత్యకృత్యమైందన్న భావనలు ఉన్నాయి. ఇటీవల తాడిపత్రి స్టేషన్‌లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ హోల్టింగ్ ఎత్తివేసిన ఒక్కరోజుకే అక్కడి ప్రజాప్రతినిధి దెబ్బకు దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారులు దిగి అప్పటికప్పుడే హోల్టింగ్ కొనసాగించిన సంగతి అందరికీ తెలిసిందే.

కరోనా ముందున్న హోల్టింగ్స్‌ను పునరుద్ధరించాలి



కరోనా ముందున్న హోల్టింగ్స్‌ను పునరుద్ధరించాలని ఇప్పటికే ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డిలు రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లారు. నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు, కమలాపురం, ముద్దనూరు, కొండాపురం రైల్వే స్టేషన్‌లో కరోనా రాకముందు ఏ విధంగా రైళ్లకు హోల్టింగ్ ఉందో అదే కొనసాగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– తంబళ్ల వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్‌యుసీసీ సభ్యుడు, రాజంపేట

ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకోవాలి..



బీజేపీ ప్రభుత్వం ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని రైళ్లకు హోల్టింగ్స్‌ను పునరుద్ధరించాలి. అంతేకాని ఎర్నింగ్స్ సాకుగా చూపి రైళ్ల హోల్టింగ్స్ ఎత్తివేయడం ప్రజావిధానాలకు వ్యతిరేకం. కరోనా ముందున్న హోల్టింగ్స్ కోసం జనఉద్యమాలు పుట్టుకొస్తాయి. ప్రజాగ్రహంకు కేంద్ర పాలకులు దిగిరావాల్సిందే.

– మహేష్, సీపీఐ నేత, నందలూరు

అధికారులు ఆలోచించాలి



సామాన్యులు రైలు ప్రయాణాలకు దూరమయ్యారు. కీలక రైల్వేస్టేషన్లలో కూడా కొన్ని రైళ్లకు హోల్టింగ్, మరొకొన్నింటికి హోల్టింగ్ లేకుండా చేస్తుండటం వల్ల ఈ పరిస్థితులు ఉన్నాయి. రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు విషయంలోకానీ, పార్లమెంటరీ కేంద్రమైన రాజంపేట విషయంలో రైల్వే ఉన్నతాధికారులు తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజావ్యతిరేక వస్తుంది. అధికారులు ఆలోచించాలి.

– షేక్ మహమ్మద్‌అలీ, మాజీ ఏజీపీ, నందలూరు

న్యాయవాదులది కీలకపాత్ర

– జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి



న్యాయవాదులలో కలసి ఐఏఎల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి

రాయచోటి అర్బన్ : స్వాతంత్ర్యం రాకమునుపు కాని, వచ్చిన తర్వాత కాని సామాజిక మార్పులలో న్యాయవాదులు కీలకపాత్ర పోషిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తున్నారని రాయచోటి 5వ అదనపు జిల్లాజడ్జి కృష్ణన్ కుట్టి అన్నారు. మంగళవారం రాయచోటి కోర్టు ఆవరణలో భారత న్యాయవాదుల సంఘం కడప - అన్నమయ్య జిల్లాల క్యాలెండర్‌ను ఆయన న్యాయవాదులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, బి.ఆర్.అంబేడ్కర్ లాంటి మహానుభావులు బ్రిటీష్‌వారిపై పోరాటం చేసి స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టారని, వీరంతా న్యాయవాదులే అన్నారు. కార్య క్రమంలో ఐఏఎల్ ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి డి.నాగముని, ఏపీపీ జగన్‌మోహన్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ధనుంజయ, ఆనంద్, రామాంజనేయులు, వీరభద్రయ్య, నాగమల్లు, రెడ్డిబాష, టి.వి.రమణ, కేజర్‌అలీ, ఆదిరెడ్డి నాయక్, రవి శంకర్, క్రిష్ణమ్మ, వరలక్ష్మి, ఉత్తేజ్ కుమార్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

దగా చేస్తున్న కూటమి సర్కారు

- 13న ర్యాలీని జయప్రదం చేయాలి
- రైతులు నిరసన గళం వినిపించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి

రాజంపేట : కూటమి ప్రభుత్వం అన్నదాతలను దగా చేస్తోందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన రైతులకు స్వర్ణయుగమని గుర్తు చేశారు. మంగళవారం పట్టణంలోని ఆకేపాటి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలుగా మేలు జరిగే కార్యక్రమాలను చేపట్టారన్నారు. రైతుల హృదయాల్లో వైఎస్ జగన్‌కు ప్రత్యేక స్థానముందన్నారు. రైతు భరోసా, గిట్టుబాటు ధరలు, దళారీ వ్యవస్థకు చెక్, ఉచిత పంటల బీమా లాంటివి ఎన్నో తీసుకొచ్చిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. పార్టీ పిలుపు మేరకు ఈ నెల 13న కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ చేపట్టనున్నామని, రైతులంతా తమకు జరుగుతున్న అన్యాయంపై గళం విప్పాలని పిలుపునిచ్చారు. అన్నదాతను నట్టేట ముంచిన ప్రభుత్వానికి గట్టిగా



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి

బుద్ధి చెప్పే విధంగా భారీగా రాయచోటికి రైతులు కదిలిరావాలన్నారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరుచుకునేలా రైతులు నిరసన ర్యాలీలో పాల్గొని తమ మనోగతం తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వం జగనన్న రైతు భరోసాకు ఎసరుపెట్టిందన్నారు. అన్నదాతా సుఖీభవ అంటూ పచ్చి మోసం చేశారన్నారు. ఏడాదికి రూ.20 వేలు ఇస్తామంటూ చేసిన సూపర్‌సిక్స్ హామీ కనుమరుగైందన్నారు. అంతకుముందుగా ర్యాలీ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, జడ్పీటీసీ దాసరి పెంచలయ్య, సుబ్బరాజు, మైనార్టీ నాయకులు హైదర్, జావిద్ అలీ, మసూద్ అలీఖాన్, అంజాద్, మున్నా, అఫ్జర్, షాకీర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ సస్పెన్షన్

కడప సెవెన్‌రోడ్స్ : విధుల్లో చేరకుండా ఉద్యోగ నిబంధనలను ఉల్లంఘించి, ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన తహసీల్దార్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా తహసీల్దార్ యు.దస్తగిరయ్యను తిరుపతి జిల్లా నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలోని కేఆర్‌ఆర్‌సీ తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నిర్ణీత గడువులోగా జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి వుండగా నిర్లక్ష్యం చేయడంతో కలెక్టర్ మెమో ఇచ్చారు. అయినా ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడంతో తహసీల్దార్ యు.దస్తగిరయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో అలసత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అన్నారు. మంగళవారం కోదండరాముడి బ్రహ్మోత్సవాలపై స్థానిక పీఎస్‌పీలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కోదండరామున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు రామాలయం చుట్టూ గ్రీనరీని పెంచాలని, లైటింగ్ ఏర్పాట్లు, రామాలయం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. రామాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రామాలయ చరిత్రను జోడించి టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రచారం కల్పించాలని సూచించారు. సోషల్ మీడియాలో రామాలయ విశిష్టతను విధిగా ప్రచారం కల్పించాలన్నారు. అనంతరం భక్తులకు అందజేస్తున్న ఉచిత అన్న ప్రసాదాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

బ్రహ్మోత్సవాల నిధులకు ప్రాథమిక నివేదిక తయారు చేయండి

బ్రహ్మోత్సవాలకు అవసరమయ్యే నిధులకు ప్రాథమిక నివేదికను తయారు చేయాలని టీటీడీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాల నాటికి చేపట్టాల్సిన పనులు, అలంకార మండపం, పూజకు అవసరమయ్యే వస్తువులు సేకరణ, భక్తులకు అవసరమయ్యే షెల్టర్లను, తాగునీటి సరఫరా, రామాలయంలో పెద్దఎత్తున లైటింగ్, ఇతర పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేఈఓ వీరబ్రహ్మం

కోదండరాముని భూములకు హద్దులను కేటాయించండి

కోదండరామునికి సంబంధించిన భూముల హద్దులను స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేయాలని స్థానిక సర్వేయర్లను వీరబ్రహ్మం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ స్పెషల్ ఆఫీసర్ ప్రశాంతి, డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, గుణ భూషణ్ రెడ్డి, ఈఈ సుమతి, డీఈ వెంకటేశ్వర్లు, ఏ.అమర్‌నాథ్ టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చిన్నమండెం : మండల కేంద్రంలోని చిన్నమండెం, పడమటికోన, కొత్తపల్లి యూనిట్‌లలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్, జిల్లా డీపీఎం ప్రవీణ్ కుమార్‌లు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలలో మంగళవారం పర్యటించారు. మొదటగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్వగృహంలో వేసిన 365 రోజుల ఏ గ్రేడ్ కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. నడిగడ్డ పల్లెలో స్వాతి, ధర్మారెడ్డి, రాధిక, నాగిరెడ్డి పొలాలను పరిశీలించి ప్రకృతి వ్యవసాయంపై పలు సూచనలు, సలహాలు అందించారు. వీరితో పాటు ఎమ్‌టీఎల్ చందురెడ్డి, మార్కెటింగ్ ఎమ్‌టీ పద్మావతి, ఎన్ఎఫ్ఐ చంద్రశేఖర్, ఎమ్‌టీ శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు. చిన్నమండెం మండల పరిధిలోని కేశాపురంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్, జిల్లా డీపీఎం ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి గీత, ప్రకృతి వ్యవసాయం మండల కో ఆర్డినేటర్ చందురెడ్డి పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రనాయక్

బెటాలియన్‌లో రసవత్తరంగా పోటీలు



బెటాలియన్‌లో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీలకు హాజరైన పోలీసులు

సిద్దవటం (ఒంటిమిట్ట) : 11వ ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో జరుగుతున్న 17వ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024 పోటీలు రసవత్తరంగా సాగుతున్నట్లు 11వ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్ డి. నాగేశ్వర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా వార్షిక క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రెండోరోజు పరుగు పోటీలు, టగ్‌ఆఫ్ వార్, డిస్కస్ త్రో, వాలీబాల్, జావెలిన్ త్రో పాటు పలు క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన విజేతలకు ఫైనల్ పోటీలు నిర్వహించి శుక్రవారం ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు కె వెంకటరెడ్డి, ఎం తియోఫిలస్, పీఎన్‌డీ ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి.. సర్వే బాబూ..!

- డ్వాక్రా కుటుంబాల సంపాదనపై కూటమి ఆరా?
- కుటుంబంలోని సమస్త సమాచారం ఇవ్వాలట!
- ఇల్లు , కారు, బైకు, స్మార్ట్‌ఫోన్, గ్యాస్ నంబర్ చెప్పాలంట
- ఆరు పేజీల ప్రశ్నావళితో సమగ్రమైన సర్వే
- మెప్మా, డీఆర్‌డీఏలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు

స్వయం సహాయక సంఘాలు	:	10,008
వీఓలు	:	1048
స్వయం సహాయక సభ్యులు	:	311553

మదనపల్లె సిటీ : అలవికాని హామీలు.. అమలు చేయలేక ఆడంబరాలు..ఎలా కోత పెట్టాలన్న ఆలోచనలు.. వెరసి స్వయం సహాయ సంఘాల సభ్యుల సమస్త వివరాల సేకరణకు ఆరు పేజీల ప్రశ్నావళి. గూగుల్ పే, ఫోన్‌పే , గ్యాస్ నంబర్ సహా అన్నింటిపై ఆరాకు సర్వేలు.. ఫలితం సంఘ ద్రోహం తప్పదా బాబూ అని అతివల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ నేటి కూటమి ప్రభుత్వం కొత్త మోసం. జిల్లాలో స్వయం సహాయక సంఘాల కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై కూటమి ప్రభుత్వం కన్నేసింది. ఇప్పటి దాకా గ్రూపు సభ్యుల కుటుంబాల సంపాదన వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, కుటుంబ సభ్యుల వ్యాపారాలు, ఉద్యోగాలు, వారికున్న సదుపాయాలు తదితరాల వివరాలు సేకరణకు సర్వే చేస్తున్నారు. తద్వారా వీరి ఆర్థిక స్థితిగతులను తెలుసుకుని భవిష్యత్తులో వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో వీరికి ఎలాంటి కోతలు పెట్టాలనే ఆలోచనలతో ప్రభుత్వం ముందుకెళుతోందన్న మాట వినిపిస్తోంది. ఇందుకు సంబంధించి మెప్మా, డీఆర్‌డీఏలకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీనిపై మున్సిపాలిటీల్లో మెప్మా రిసోర్సుపర్సన్లు (ఆర్పీలు), మండలాల్లో సంఘమిత్రలు ద్వారా గత పది రోజులుగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.



మదనపల్లెలోని వెలుగు కార్యాలయం

ఇంటింటి సర్వేలో ఏం చేస్తారంటే....!

గ్రూపు సభ్యులు ఇప్పటి వరకు పొందిన రుణాలు, రుణ బకాయిల చెల్లింపులు, కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఉద్యోగాలు, వారి సంపాదన మార్గాలు, జీవనోపాధులు, ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి, ఎవరైనా జీఎస్టీ చెల్లిస్తున్నారా? వారి వివరాలను ఆరు పేజీల ప్రశ్నావళితో కూడిన సమగ్రమైన సర్వే సాగుతోంది. దీంతో పాటు వారు నివసిస్తున్న ఇళ్లు, ప్రైవేటు బీమా వివరాలు, ఇంట్లో ఉద్యోగాలను చేస్తున్న వారు ఎక్కడ ఉంటున్నారు. వారికి వచ్చే జీతాల వివరాలను సేకరించనున్నారు. దీంతో పాటు గ్రూపు సభ్యురాలు వాడుతున్న ఫోను స్మార్ట్‌ఫోనా లేదా డయల్ ప్యాడ్ అని గమనించనున్నారు. స్మార్ట్‌ఫోన్ అయితే వారి గూగుల్ పే, ఫోన్ పే ద్వారా ఇప్పటి దాకా సాగిన డిజిటల్ లావాదేవీలను గుర్తించడం జరుగుతోంది. దీంతోపాటు ఆ ఇంట్లో గ్యాస్ పొందుతున్న వారి పేరు, గ్యాస్ నంబర్లను సైతం సేకరిస్తున్నారు.

మున్సిపాలిటీలు

మున్సిపాలిటీ	ఎస్‌హెచ్‌జీలు	ఎస్ఎల్ఎఫ్‌లు	సభ్యులు
మదనపల్లె	2357	69	24,153
రాజంపేట	722	24	7,892
రాయచోటి	1378	45	14,314

ఇది సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ లాగేనా...!

గతంలో ప్రభుత్వ పథకాలు సవ్యంగా సాగేందుకు సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్‌ను అమలు చేశారు. ఇందులో ఇంటి విస్తీర్ణం, ఇంటికి నెలకొచ్చే కరెంటు బిల్లు, ఇంట్లోని సభ్యులెవరైనా ప్రైవేటు ఉద్యోగాల్లో ఉన్నారా? ఎవరైనా ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్నారా? అని తేల్చి వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా చేశారు. ఇప్పుడు దీన్ని మార్చి గ్రూపుల్లోని మహిళల ఇళ్లల్లో ప్రొఫైల్ యాప్ పేరిట ఈ సమగ్ర ఆదాయ సర్వేని చేపట్టంతో గ్రూపు మహిళల్లో ఆందోళనలు తప్పడం లేదు. భవిష్యత్తులో తమకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని వారు భయపడుతున్నారు. ఈ విషయంపై మెప్మా అధికారులు ఈ సమగ్ర సర్వేపై ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ఈ సర్వే ద్వారా గ్రూపు మహిళల కుటుంబాలు బాగుపడ్డాయా? లేదా అని స్పష్టమవుతుందన్నారు. ఏదేమైనా గ్రూపు సభ్యులు మాత్రం ఈ సమగ్ర సర్వేపై ఆందోళన చెందుతున్నారు.